TE TL/26/A2635

వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక



## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాల్సిందే

• తులం బంగారం ఇవ్వాల్సిందే

8




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:97 | 19-08-2026 బుధవారం | పేజీలు: 08 | వెల 3/-







# ది శ్రీరామ్ అకాడమీ అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

- నోటీసులు జారీ చేశాం
- తదుపరి ప్రక్రియ ప్రారంభిస్తాం

**డీడీ9 వార్తతో నార్సింగి ఏసీపీ ఎన్. ప్రసీద**

చంద్రుకుంట చెరువు ను ఆక్రమించి నిర్మిస్తున్న "ది శ్రీరామ్ అకాడమీ పాఠశాల నిర్మాణం పై కచ్చితంగ చర్యలు తీసుకుంటాం అని నార్సింగి సర్కిల్ ఏసీపీ ఎన్ ప్రసీద్ డిడి9 వార్త కు తెలిపారు . రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్45 పరిధిలోని వార్డ్ నంబర్ 2 గొలిదొడ్డి గ్రామంలో "ది శ్రీరామ్ అకాడమీ" పాఠశాల యాజమాన్యం చంద్రకుంట చెరువు పరిధిని ఆక్రమించి సుమారు 30,000 చదరపు గజాల్లో అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్న విషయం పై డిడి9 వార్త వరుస కథనాలతో తేటతెల్లం అయ్యింది.

డిడి9 వార్త స్పెషల్ ఇన్వెస్టిగేషన్ విభాగం, హైదరాబాద్:



2

## చంపత్ రాయ్, అనిల్ మిశ్రాకు సిట్ క్లీన్‌చిట్

- అయోధ్య రామ మందిర విరాళాల కేసు లో కొనసాగుతున్న దర్యాప్తు
- మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు ఊరట
- మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు కూడా క్లీన్‌చిట్
- ఇద్దరిపై ఎలాంటి నేరపూరిత తప్పిదం లేదన్న ఎస్ఐటీ
- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పణ
- నివేదికను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేత

## హరీశ్‌రావు అబద్ధాల రావు

- పొంగులేటి తీవ్ర విమర్శలు
- ప్రైవేట్ భూములకు 22ఏ నుంచి విముక్తి
- సాంకేతిక సమస్యలు తలెత్తాయని వెల్లడి
- ప్రజలకు భేషరతుగా క్షమాపణలు
- హరీశ్ విమర్శలు హాస్యాస్పదమని వ్యాఖ్య
- ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు
- నెలాఖరు నాటికే భూ సమస్యల పరిష్కారం
- అధికారులకు పొంగులేటి కఠిన ఆదేశాలు



హైదరాబాద్, :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్‌రావుపై తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంచలన విమర్శలు చేశారు. హరీశ్‌రావు తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఆయన పేరును 'అబద్ధాల రావు'గా మార్చుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. నిషేధిత భూముల (22ఏ) వ్యవహారంలో హరీశ్‌రావు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఒక ప్రముఖ వార్తా ఛానెల్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, ప్రైవేట్ ఆస్తులు 22ఏ జాబితాలోకి వెళ్లడం వెనుక ఉన్న సాంకేతిక కారణాలను వివరంగా వెల్లడించారు. తాము తప్పును దాచిపెట్టేందుకు ప్రయత్నించడం లేదని, బాధ్యతాయుతమైన ప్రభుత్వంగా ప్రజలకు నిజాన్ని వివరించామని స్పష్టం చేశారు. 22ఏ జాబితా కారణముగా ప్రైవేట్ ఆస్తుల రిజిస్ట్రేషన్లకు విఘాతం కలిగిందనేది వాస్తవమేనని, అయితే ఈ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పొంగులేటి తెలిపారు. భూముల క్లియరెన్స్ మిగతా 2లో..

## అన్యాయంగా ఓట్లను తొలగించారు

- తెలంగాణలో 73 లక్షల ఓట్లు డిలిట్
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లలేదని విమర్శ
- పేదలు, వలస కూలీల ఓట్లే ఎక్కువగా తొలగించారని వ్యాఖ్య
- 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్న
- రాష్ట్రంలో 73 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ
- మొత్తంగా 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని వ్యాఖ్య
- డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పుతో పాత వివరాల్లో గందరగోళం
- ఎన్నికల సంఘాన్ని కేంద్రం తన జేబు సంస్థగా మార్చుకుందని విమర్శ




హైదరాబాద్,

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఎవరి ఇళ్లకూ వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారని అన్నారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి మిగతా 2వ పేజీలో..

## భూమిలేని పేదలకు ఎకరం..

**భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత**

**రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ**

**రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ**



హైదరాబాద్:

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని మిగతా 2లో..

## భూ దందాలపై ఈటల ధ్వజం!

- కాంగ్రెస్ పాలనలో భూ అక్రమాలు రెండింతలు
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణ
- సెక్షన్ 22 ఏ నిషేధిత జాబితాలో భూములు చేర్చడంపై ఆగ్రహం
- భూములను లాక్కొని భూమాఫియాకు కట్టబెట్టే కుట్ర
- ధరణి పోర్టల్ స్థానంలో ఏమాత్రం మార్పు రాలేదని విమర్శ
- రేవంత్ సర్కార్ సెటిల్‌మెంట్ చేసుకుంటోందని వ్యాఖ్యలు



హైదరాబాద్,

రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనే భూ దోపిడీ రెండింతలు పెరిగిందని భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ మరియు రేవంత్ రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు గతంలో ప్రజలకు కేటాయించిన స్థలాలు, పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూములు, చివరికి ప్రభుత్వమే మిగతా 2లో..

# యాజమాన్యాల బెదిరింపులకు తలొగ్గేది లేదు..

**మొదటిపేజీ తరువాయి**

మామూలుగా వచ్చేవేనని, వాటికి భయ పడాల్సిన పనిలేదన్నారు. గత నెల 18వ తేదీనే నాలుగు కంపెనీల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని, వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం వల్లే ఆందోళనకు సిద్ధ మయ్యామని స్పష్టం చేశారు. తమ హక్కుల ను కాలరాయడానికి యాజమాన్యాలు అవ లంబిస్తున్న ఏకపక్ష విధానాలపైనే తాము నిరసన తెలుపుతున్నామని, దీనికి నాలుగు కంపెనీల యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని సాయిబాబా అన్నారు. పనిభారం విపరీ తంగా పెరిగిందని, తక్షణమే ఖాళీలన్నీ భర్తీ చేయాలని కోరినా యాజమాన్యాలు పట్టిం చుకోలేదని మండిపడ్డారు. మహారాష్ట్రలో అమలు చేసిన విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేయాలని కోరినా స్పందన లేదని, అన్ని క్యా డర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం లోనూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరో పించారు. తమ ముందుంచిన 14 ప్రధాన డిమాండ్లపై కనీసం చర్చలకు కూడా పిలవ కుండా మొండి వైఖరి ప్రదర్శించడమే నేటి మహాధర్నాకు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. మా సంస్థల్లో ప్రైవేటు భాగస్వామ్యా న్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని జేఏసీ నేతలు హెచ్చరించారు. నేడు విద్యుత్ సౌధ కేంద్రంగా జరగనున్న మహాధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా ఉద్యోగులు, కార్మి కులు, ఆర్టిసియన్లు అందరూ సంఘటితంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు రత్నాకర రావు, జేఎల్ జనప్రియ, సదానందం, తాజోద్దీన్ బాబా తదితర వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ రంగంలో కొత్త దిశగా తెలంగాణ

- రాష్ట్రాన్ని క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా చేస్తాం
- పెట్టుబడిదారులకు స్వర్గధామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఇండియా ఎనర్జీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఏఐ టెక్నాలజీతో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాం
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

**హైదరాబాద్, ఆగస్టు 18 :**

తెలంగాణలోని విద్యుత్ సంస్థలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని దేశంలోనే ముందుంటున్నాయని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో నిర్వహించిన 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో 2026' కార్యక్రమా న్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలం గాణను పెట్టుబడిదారులకు స్వర్గధామం గా, క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా తీర్చిది ద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. ప్రజలకు చేరువయ్యే ప్రతి వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందంజలో ఉంటుందని స్పష్టం చేశారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన 'మాడర్నైజింగ్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రి బ్యూషన్ స్మార్ట్ గ్రిడ్స్ ఫర్ ఎ రిలయబుల్ పవర్ ఫ్యూచర్' ప్యానెల్ చర్చలో టీజీఎస్పీ డీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పాల్గొని సంస్థలో అమలు చేస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, నెట్‌వర్క్ మ్యాపింగ్ మరియు స్మార్ట్ మీటరింగ్ కార్యక్రమాల గురించి వివరిం చారు. టీజీఎస్పీడీసీఎల్‌లో ప్రతిరోజూ, ప్రతి వారం విద్యుత్ వ్యవస్థ పనితీరుపై సమగ్ర విశ్లేషణలు నిర్వహిస్తున్నామని, ఏఐ సాం కేతికత ద్వారా తక్కువ సమయంలో భారీ డేటాను విశ్లేషించి నష్టాలను తగ్గించడంతో పాటు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.

**నెట్‌వర్క్ మ్యాపింగ్ - స్మార్ట్ మీటరింగ్ విశేషాలు**

జూలై నెలలోనే సంస్థ విద్యుత్ నెట్‌వర్క్‌కు సంబంధించిన 'ఎండ్‌టుఎండ్ నెట్‌వర్క్ మ్యాపింగ్' పూర్తి చేసిందని సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. వినియోగదారుల యూఎస్సీ నంబర్ ఆధారంగా విద్యుత్ సరఫరా ఏ పోల్, ఏ డిస్ట్రిబ్యూషన్ ట్రా న్స్‌ఫార్మర్, ఏ సబ్‌స్టేషన్, ఏ ఫీడర్ ద్వారా వస్తోందో కచ్చితంగా గుర్తించే సామర్థ్యాన్ని సాధించామన్నారు. హైదరాబాద్ నగరం లోని ప్రధాన ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ కేబులింగ్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేయకముందే సమస్యలను గుర్తించి పరిష్కరించవచ్చని, బిల్లులు పెరుగుతాయనే అపోహలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. డిజిటల్ పర్సన ల్ డేటా ప్రొటెక్షన్ చట్టానికి అనుగుణంగా వినియోగదారుల డేటా గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కె. వరుణ్ రెడ్డి, డైరెక్టర్లు వి. శివాజీ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎండీ జితేష్ వి. పాటిల్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ సాంకేతిక ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు.






# ది శ్రీరామ్ అకాడమీ

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు



**మొదటిపేజీ తరువాయి**

జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సైతం త్వరిత గతిలో నివేదిక తయారు చేసి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా గా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి కి రాయడం జరిగింది.జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్సింగి సర్కిల్ ఏసీపీ ఎన్ ప్రసీద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు అలాగే రిపోర్ట్ తయారు చేస్తున్నట్టు తరువాత సీఎంసీ దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్ తో కలిసి అవసరం అయితే ఎస్టీఎఫ్ ను సైతం రంగం లోకి దింపుతామని తెలిపారు ఎఫ్ ఎన్ ఎఫ్ దాబా (షెడ్డు) కు సైతం నోటీసులు జనవాడ-శంకర్‌పల్లి రోడ్డులో రోస్ట్ క్రంచ్ కేఫ్ సమీపంలో సిల్వర్ రీస్ట్రీట్ పక్కన ప్రధాన రహదారి వెంబడి అనుమతులు లేకుండా ఎఫ్ఎన్ ఎఫ్ వారు నిర్మిస్తున్న దాబా (షెడ్డు) ప్రారంభించినప్పటికి నోటిస్లు జారీచేసి ఖచ్చితంగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు అలాగే అలాగే మేకల గడ్డ లో నిర్మిస్తున్న పది కాటేజ్ ల అక్రమ నిర్మాణ దారులకు అలాగే అదే రోడ్డు చివర నిర్మిస్తున్న భారీ షెడ్డు ల పై సైతం నోటీస్ లు ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు మోకీల పోలీసుస్టేషన్ ఇవతల అక్రమంగా నిర్మిస్తున్న భారీ ఫంక్షన్ హాల్ యాజమాన్యంకు నోటీస్ లు ఇచ్చి నివేదిక తయారు చేసి ఎస్టీఎఫ్ తో కూల్చివేసేందుకు సైతం వెను కాడబోమని ఈ సందర్భంగా తెలిపారు





నోటీస్ బోర్డు ఏర్పాటు చేసిన తరువాత

# హరీశ్‌రావు అబద్ధాల రావు

**మొదటిపేజీ తరువాయి**

కోసం ప్రభుత్వం డబ్బులు వసూలు చేస్తోం దంటూ హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. ప్రభుత్వ ని బంధనల ప్రకారం ప్రభుత్వ భూములు కాని వాటిని, ప్రైవేట్ వ్యక్తుల హక్కు భుక్తాల్లో ఉన్న భూములను కచ్చితంగా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగా తాము నిందలను ఇతరులపై నెట్టివేసి దబాయించే రకం కాదని తేల్చి చెప్పారు. ఈ భూ సమస్యలు ఎందుకు తలె త్తాయో వివరిస్తూ.. 1998 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి ఇప్పటి వరకు జీవోలు, ప్రభుత్వ మెమోల ద్వారా హక్కులు పొందిన భూముల వివరాలను గత ప్రభుత్వం ఆన్‌లైన్ డేటాబేస్‌లో సరిగ్గా అప్‌లోడ్ చేయలేదని పొంగులేటి వెల్లడిం చారు. సాఫ్ట్ కాపీలు అందుబాటులో లేకపోవడం తో, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాల కలెక్టర్లు పాత రికార్డుల ఆధారంగా 22ఏ జాబితాను సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారని, దానివల్లనే ఈ సాంకేతిక సమస్య ఉత్పన్నమైందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తాము ముందుగానే గుర్తించి, యుద్ధప్రాతిపాదికన రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తున్నామని చెప్పారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్ల పూర్తి చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నాయని మంత్రి పునరుద్ఘాటించారు. సాంకేతిక కారణాల వల్ల ప్ర జలకు జరిగిన ఇబ్బందికి అధికారుల తరఫున తానే స్వయంగా క్షమాపణలు చెప్పానని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో 'ధరణి' పోర్టల్ తెచ్చిన తిరోగమన మార్పుల వల్ల ఎంతోమంది సామాన్యులు ఆస్తులు కోల్పోయి రోడ్డున పడ్డార ని, ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నా నాటి ప్రభుత్వం కనీసం స్పందించలేదని మండిపడ్డా రు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా నిబద్ధత ఉంటే నాటి ధరణి అక్రమాలపై గుండెల మీద చేయి వేసుకుని సమాధానం చెప్పాలని సవాలు విసిరారు. హైదరాబాద్ కోర్ ఏరియాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయబద్ధమైన భూ యజ మానుల ఆస్తులకు తమ ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ ఆస్తులను బంధువులకు, అనుచరులకు పంచిపెట్టే సంస్కృతి తమది కాదని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలు పడు తున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ నెలాఖరు నాటికే సమస్యలన్నింటినీ పరిష్కరిం చేలా గడువు విధించామని తెలిపారు. అర్హులైన ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా రిజి స్ట్రేషన్లు వేగవంతం చేస్తామన్నారు.

22ఏ సమస్యను శాశ్వతంగా, వేగంగా పరి ష్కరించడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఐజీ లోకేశ్, రాజీవ్ గాంధీలతో పాటు మరొక ముగ్గురు కీలక అధి కారులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఈ కమిటీ రాబోయే 15 రోజుల పాటు ప్రతిరోజూ సమావేశమై, హైదరాబాద్ కోర్ ప్రాంతంతో పాటు ఇతర జిల్లాల్లో ఉన్న నిజమైన హక్కుదారుల వినతులను పరిశీలించి తక్షణ పరి ష్కారం చూపిస్తుందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలకు ఎలాంటి అవస్థలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి చెప్పారు. స్లాట్ల కొరత ఏర్పడితే తక్షణమే అదనపు స్లాట్లను అం దుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ పారదర్శక చర్యల వల్ల ప్రైవేట్ భూ యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, భూములపై పూర్తి హక్కులు పునరు ద్ధరించబడతాయని ఆయన భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ కలిసి చేసే కుట్రలను తిప్పికొడతామని పొంగులేటి హెచ్చరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, కేవలం వార్తల్లో నిలవడానికే హరీశ్‌రావు అనుచిత విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన అందిస్తూ, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధా న్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.





# భూ దందాలపై ఈటల ధ్వజం!

**మొదటిపేజీ తరువాయి**

స్వయంగా లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను కూడా ఇప్పుడు 22 ఏ (వివాదా స్పద/నిషేధిత) జాబితాలో చేర్చడం దారుణమ ని ఆయన మండిపడ్డారు.

రైతులు దశాబ్దాలుగా నమ్ముకుని సాగు చేసు కుంటున్న భూములను దౌర్జన్యంగా లాక్కోవ డం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఈటల ఆరో పించారు. పేదలు, రైతుల నుంచి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుని, వాటిని రియల్ ఎస్టేట్ మరియు భూమాఫియాకు దారాదత్తం చేయడమే ప్రభుత్వాల ప్రధాన నైజంగా మారిందని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్ స్థానంలో కొత్త మార్పులు తీసుకొచ్చామ ని చెప్తున్నప్పటికీ, ప్రజల భూములను లాక్కునే ప్రభుత్వాల ధోరణిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన వ్యాఖ్యానించారు.

గత కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు మరియు అక్రమాలకు పాల్పడితే, ఇప్పటి రేవంత్ రెడ్డి సర్కార్ ఆ భూములను తమకు అనుకూలంగా 'సెటిల్ మెంట్లు' చేసుకుంటోందని సంచలన ఆరోపణలు చేశారు. గతంలో జరిగిన హుజూ రాబాద్ శాసనసభ ఉప ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు నీళ్లలా ఖర్చు చేసిన రూ. వందల కోట్లు ఇలాంటి భూ దందాలు, అక్రమ మార్గాల ద్వారా సంపాదించినవేనని ఆయన విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పేదల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారులోని గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ మీదుగా ఏ రకంగా చేతులు మారాయో రాష్ట్ర ప్రజలందరికీ బాగా తెలుసని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ భూ మార్పిడి వ్యవహారంలో, అక్రమాల్లో బడా రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. ప్రభుత్వాలు పేదలకు, రైతులకు న్యాయం చేయాల్సింది పోయి, బడా రియల్ ఎస్టేట్ మాఫియాలకు, బిల్డర్లకు కొమ్ము కాయడం తగదని ఆయన తీవ్రంగా హెచ్చరిం చారు.

ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బాధితులైన పేదలు, రైతుల తలరాతలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సం పాదించుకున్న సొంత భూములను 22 ఏ జాబితాలో చేర్చడంతో సామాన్యులు రిజిస్ట్రేషన్లు కాక, అవసరాలకు అమ్ముకోలేక తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. భూ హక్కుల రక్షణ కోసం బాధితులు అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ రకమైన భూ అరాచకాలు, అక్రమ సెటిల్‌మెంట్లను బీజేపీ చూస్తూ ఊరు కోదని ఈటల స్పష్టం చేశారు. పేదలు, రైతుల హక్కులను కాపాడే వరకు తమ పార్టీ ప్రభు త్వంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తేల్చి చెప్పారు. సేకరించిన భూములను తిరిగి బాధితులకు అప్పగించే వరకు, 22 ఏ నిషేధిత జాబితా నుంచి సామాన్యుల భూములను తొలగించే వరకు ప్రజల పక్షాన నిలబడి పోరా డతామని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి భూ బాధితులకు న్యాయం చేయాలని, 22 ఏ జాబితా పేరుతో చేస్తున్న వేధింపులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం కాకుండా, పేద రైతు కుటుంబాల సంక్షేమా న్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకో వాలని హితవు పలికారు. అక్రమాలకు పా ల్పడుతున్న ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముగింపుగా, ప్రజా సమస్యలపై బీజేపీ ఎల్ల ప్పుడూ ముందుంటుందని, భూ బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయ సహాయం మరియు రాజకీయ మద్దతు అందిస్తుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్ర మాలు చేపడతామని హెచ్చరించారు.



## ఉద్యమకారుడి విగ్రహ ధ్వంసం దుర్మార్గం

**జనగామ ఆగష్టు18(డిడి 9వార్త )బ్యూరో**




తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ జనగామ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ ఖండించారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. విగ్రహాన్ని అదే స్థలంలో తిరిగి ప్రతిష్ఠించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళి



**జనగామ ఆగష్టు18(డిడి 9 వార్త)బ్యూరో**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన ఖిలాషాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణు ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**జనగామ ఆగష్టు 18(డిడి9వార్త)బ్యూరో**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జనగామ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కల్నల్ మాచర్ల బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో బీసీల రాజ్యాధికారం కోసం టీఆర్పీ పోరాడుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు షైన్ హైస్కూల్ విద్యార్థుల సామూహిక ప్రతిజ్ఞ




**బోనకల్,ఆగస్టు18,(డీడీ9 వార్త):**

10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞ మహా ఉద్యమంలో భాగంగా మండల పరిధిలోని స్థానిక షైన్ హై స్కూల్ లో విద్యార్థులతో మంగళవారం మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వారి జీవితంలో ఎప్పుడు ఎలాంటి పరిస్థితులలో అయిన మాదక ద్రావ్యాలు స్వీకరించనని,కుటుంబాన్ని,సమాజాన్ని దీని నుంచి రక్షించడానికి ప్రయత్నం చేస్తానని పిల్లలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆళ్ళ సీతారామయ్య,పాఠశాల కారెస్పాండంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ అయిటిపాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

# రామగుండం సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో విజయవంతంగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్స





**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 19:**

రామగుండంలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆర్థోపెడిక్స్ విభాగం అవుట్‌పేషెంట్ విభాగానికి 70 ఏళ్ల మహిళ గత రెండేళ్లుగా ఎడమ మోకాలిలో నిరంతర నొప్పి, నడవడంలో ఇబ్బందితో వచ్చారు. కాలక్రమేణా ఆమె సమస్య తీవ్రతరం కావడంతో రోజువారీ కార్యకలాపాలు, కదలికలు గణనీయంగా ప్రభావితమయ్యాయి.వైద్య పరీక్షల్లో ఎడమ మోకాలిలో గణనీయమైన వైకల్యంతో పాటు కదలికలు పరిమితంగా, నొప్పితో ఉన్నట్లు గుర్తించారు. ఎక్స్‌రే పరీక్షల్లో మోకాలి కీలులో తీవ్ర ఆర్థరైటిస్ మార్పులు, కీళ్ల మధ్య ఖాళీ గణనీయంగా తగ్గడం, క్షీణతకు సంబంధించిన మార్పులు, మోకాలి ఆకృతిలో వైకల్యం ఉన్నట్లు నిర్ధారణ అయింది.రోగి లక్షణాల తీవ్రత, నడకలో మరియు రోజువారీ కార్యకలాపాల్లో ఏర్పడిన ఇబ్బందులు, మోకాలి కీలులో ఉన్న తీవ్రమైన క్షీణతను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న చికిత్సా విధానాల గురించి రోగికి వివరించారు. వ్యాధి తీవ్రతతో పాటు జీవన నాణ్యతపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మోకాలు మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, సంభావ్య ప్రమాదాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం గురించి రోగికి వివరించి, ఆమె సమ్మతి పొందారు.2026 ఆగస్టు 12న డాక్టర్ ప్రదీప్ చంద్ర, ప్రొఫెసర్ మరియు ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి నాయకత్వంలో, డాక్టర్ బండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బి. యాకూబ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఈ. హేమంత్, సీనియర్ రెసిడెంట్, డాక్టర్ ఎన్. హేమంత్, సీనియర్ రెసిడెంట్, అలాగే అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ భాను లక్ష్మి , ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి, డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ జయప్రకాశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ జాకీర్, సీనియర్ రెసిడెంట్, మరియు నర్సింగ్ సిబ్బంది రాజేష్, అజయ్ సహకారంతో ఎడమ మోకాలుకు మోకాలు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స ఎటువంటి శస్త్రచికిత్స సమయంలో సమస్యలు లేకుండా పూర్తయింది. ముందుగా ఉన్న మోకాలి వైకల్యాన్ని విజయవంతంగా సరిచేసి, మోకాలి సరైన అమరిక మరియు స్థిరత్వాన్ని పునరుద్ధరించారు.శస్త్రచికిత్స అనంతరం రోగిని పర్యవేక్షణ కోసం శస్త్రచికిత్స అనంతర విభాగానికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. శస్త్రచికిత్స అనంతరం మోకాలి నొప్పి గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రోగి సంతృప్తికరంగా కోలుకుంటున్నారు. అవసరమైన శస్త్రచికిత్స అనంతర చికిత్స మరియు పునరావాస కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.ఈ మోకాలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడం రామగుండంలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆర్థోపెడిక్స్ విభాగానికి ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది. ఈ విజయంతో ప్రాంత ప్రజలకు అధునాతన కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స సేవలను అందించే సంస్థ సామర్థ్యం మరింత బలోపేతమైంది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ మరియు ఆర్ఎంఓ డాక్టర్ కృపాభాయి ఆర్థోపెడిక్స్ విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు సహాయక సిబ్బంది సమన్వయంతో చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మోకాలు మార్పిడి వంటి అధునాతన వైద్య సేవలను ప్రభుత్వ వైద్య సంస్థలో విజయవంతంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, ఆర్థోపెడిక్స్ విభాగం మొత్తం బృందాన్ని అభినందించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు దుర్మార్గమైన చర్య

- **ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**

**మంగపేట ఆగస్టు18డీడీ9 వార్త**




తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమైన చర్య అని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రంగా ఖండించారు. అభిమానులు ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి పెద్ది సుదర్శన్ రెడ్డి ఎంతో కృషి చేశారని, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించారని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు. దేవాదుల నీటిని నర్సంపేట ప్రాంత ప్రజలకు అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమంలో చురుకుగా పాల్గొని, లాఠీ దెబ్బలు సైతం ఎదుర్కొని తెలంగాణ కోసం పోరాడారని అన్నారు. అలాంటి తెలంగాణ ఉద్యమకారుడి విగ్రహాన్ని తొలగించడం ఆయనను అవమానించడమేనని విమర్శించారు. విగ్రహాన్ని తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి స్థానం చెరిగిపోదని, ఆయన చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని లక్ష్మణ్ బాబు అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యుల మనోభావాలను, అభిమానుల ఆవేదనను ప్రభుత్వం గౌరవించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని నర్సంపేటలో ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు.

# భద్రాచలం గ్రామపంచాయతీ తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కు తీవ్ర గాయాలు

### హైదరాబాద్ కు మెరుగైన వైద్యం కోసం తరలించిన అధికారులు

**భద్రాచలం, ఆగస్టు 18 (డిడి9 వార్త)**



భద్రాచలం గ్రామపంచాయతీకి చెందిన తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ కనుకు చిట్టిబాబు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ట్రాక్టర్ అదుపుతప్పడంతో డ్రైవర్ చిట్టిబాబుకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో డ్రైవర్ కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించారు. తొలుత అధికారుల స్పందనపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వైద్యుల సూచనల మేరకు తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్ చిట్టిబాబును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి అధికారులు తరలించారు. డ్రైవర్ కు మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, డ్రైవర్ విధుల్లో ఉన్న సమయంలో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయనే అంశాలపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్న సూర్యపై విమర్శలు తగవు

### జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్

**మంగపేట ఆగస్టు18డీడీ9 వార్త**



మంత్రి సీతక్క కుమారుడు సూర్య ములుగు జిల్లాలో యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, వారికి మంచి మార్గం చూపేందుకు క్రీడా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్ అన్నారు. యువత చెడు అలవాట్లకు, చెడు మార్గాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించడం మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన వేదిక, ప్రోత్సాహం అందిస్తే జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. యువత కోసం క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న సూర్యపై కొందరు చేస్తున్న విమర్శలను జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్ తీవ్రంగా ఖండించారు. యువతను మంచి మార్గంలో నడిపించే కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడటం సరికాదని అన్నారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.

**యువత భవిష్యత్తే లక్ష్యం**

ములుగు జిల్లాలోని యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు క్రీడా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎడ్ల నరేష్ అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండేలా కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువజన సంఘాలు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడలు యువతకు ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్తును అందించే మార్గమని తెలిపారు.

**విమర్శలు కాకుండా ప్రోత్సాహం అవసరం**

యువత కోసం మంచి కార్యక్రమాలు చేపట్టే వారిని విమర్శించడం కాకుండా ప్రోత్సహించాలని జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్ అన్నారు. సూర్య ఆధ్వర్యంలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించే కార్యక్రమాలు కొనసాగడం ములుగు జిల్లాకు మంచి పరిణామమని పేర్కొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ములుగు జిల్లా నుంచి మరింత మంది యువ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా అందరూ కలిసి కృషి చేయాలని ఎడ్ల నరేష్ పిలుపునిచ్చారు.

# సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం







- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- అశ్వరావుపేట రింగ్ రోడ్డు సెంటర్లో
- సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ నటుడు సుమన్ గౌడ్...

**లఅశ్వారావుపేట:ఆగస్టు18(డిడి 9 వార్త)**

అణగారిన వర్గాల కోసం నిలబడి ప్రజల గౌరవం కోసం ధైర్యంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అశ్వారావుపేట నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గారు అన్నారు ఆయన చూపిన ధైర్యం పట్టుదల ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని రింగ్ రోడ్డు సెంటర్‌లో మండల గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి సినీ హీరో సుమన్ గౌడ్ గారు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య కుటుంబం నుంచి ఎదిగి ప్రజల కోసం గొంతెత్తిన గొప్ప నాయకుడని అన్నార అప్పటి పరిస్థితుల్లో పేదలు బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను చూసి వాటికి వ్యతిరేకంగా నిలబడిన ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ముందుకు వచ్చి పోరాడిన పాపన్న గౌడ్ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు ఆయన పేరు కేవలం ఒక వర్గానికే పరిమితం కాదని ప్రజల కోసం పోరాడిన ప్రతి మహనీయుడి చరిత్రను మన పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు ప్రస్తుత యువత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజంలో మంచి మార్పు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు కష్టాలు వచ్చినప్పుడు వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగడం ఇతరులకు అండగా నిలవడం వంటి మంచి లక్షణాలను మహనీయుల జీవితాల నుంచి నేర్చుకోవాలని అన్నారు అశ్వారావుపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు నియోజకవర్గ కేంద్రానికి వచ్చే ప్రజలకు ముఖ్యంగా యువతకు ఈ విగ్రహం పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ ఆయన చరిత్రను తెలుసుకునే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు విగ్రహ ఏర్పాటుకు చొరవ తీసుకొని అందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మండల గౌడ సంఘం ప్రతినిధులను అభినందించారు భవిష్యత్ తరాలు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను పోరాట స్ఫూర్తిని గుర్తుంచుకునేలా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం జిల్లా,మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రానికి ఖమ్మం ఎంపీ సానుకూలత

**10 కుంటల స్థలం కేటాయింపు**

**మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుపైనా హామీ**



**భద్రాచలం టౌన్ , ఆగస్టు 18 (డిడి9 వార్త)**

పాల్వంచ మండలంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ .ఎల్ . కాంతారావు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను విస్తరించడంతోపాటు, ఖమ్మం జిల్లాలో క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పాల్వంచలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బృందం ఎంపీ రఘురామిరెడ్డికి వినతిపత్రం సమర్పించింది. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంతారావు పేర్కొన్నారు. పాల్వంచలో 10 కుంటల భూమిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలంలో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రంతోపాటు మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ సెంటర్ , బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ .ఎల్ . కాంతారావు, వై. సూర్యనారాయణ, బి. వెంకటరెడ్డి, వి. కామేశ్వరరావు, జి. రాజారెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

# పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**డిడి9వార్త / పెద్దపల్లి ఆగస్టు 19:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ కే.గార్డెన్స్ లో ఎంపీడీఓ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను సర్పంచులు ప్రభుత్వ విప్ విజయరమణ రావు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...అధికార యంత్రాంగం మరియు 30 గ్రామాల సర్పంచ్లు ప్రతి అంశంపై చర్చించడం జరిగింది. ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పంచాయతీ రాజ్ ఇంజనీర్, ఆర్&బి, పంచాయతీ రాజ్ మరియు వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ వివిధ శాఖల అధికారులు, సర్పంచులతో కలిసి సమీక్షించడం జరిగిందని తెలిపారు.అధికారులు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సర్పంచుల సమన్వయంతో పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు తీర్చాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తుందని పెద్దపల్లి మండల విద్యాభివృద్ధికి 16 కోట్ల నిధులు ఖర్చు చేస్తామన్నారు. నూతన పాఠశాల భవనాలు, భవనాల మరమ్మతులు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. సర్పంచులు



గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వారు కోరారు. రాబోయే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సభకు రావాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.ఓ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.


# మణుగూరులో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటన..

**విద్యార్థుల నూతన ఆవిష్కరణలకు మంత్రి అభినందనలు.**



**మణుగూరు.ఆగస్టు 18 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరులో ప్రభుత్వ ఐటీఐ/ఏటీసీ కేంద్రంలో విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంత్రి వివేక్ వెంకటస్వామి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇప్పటికే సుమారు రూ.2 వేల కోట్లతో విద్యార్థులకు స్కిల్స్ నేర్పించేందుకు ఏటీసీ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు.మరో రూ.2 వేల కోట్లు ఖర్చు చేసి అదనంగా 65 ఏటీసీ కేంద్రాలను ప్రారంభించబోతున్నామని మంత్రి వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఈ కేంద్రాలు మంచి అవకాశాలుగా మారుతాయని, విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ఇక్కడ నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మణుగూరు ఏటీసీ కేంద్రంలో విద్యార్థులు తక్కువ ఖర్చుతో, అందుబాటులో ఉన్న పాత పరికరాలను వినియోగించి ఎలక్ట్రిక్ వాహనాలను (EV) రూపొందించడం అభినందనీయమని మంత్రి ప్రశంసించారు. ఈ ఇద్దరు విద్యార్థులు రాష్ట్రంలోని ఇతర ఏటీసీ కేంద్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తారని అన్నారు. విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఏటీసీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం నెలకు రూ.2,000 స్టైఫండ్ అందిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు కు ఏటీసీ కేంద్రాన్ని తీసుకురావడంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పట్టుదలతో కృషి చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి వారికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జపాన్, జర్మనీ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.ఈ నెల 22న జపాన్ పర్యటనకు వెళ్లనున్నానని, జపాన్‌తో ఉద్యోగాలపై ఒప్పందం కుదిరితే సుమారు 5 లక్షల వరకు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మణుగూరు ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలు యువతలో సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా మణుగూరు ITI కి రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రిగారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ మండల మరియు టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ బకాయిలపై విద్యార్థుల సమరభేరి





- రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి
- సర్టిఫికెట్లు నిలిపివేసే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం: ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు

**భద్రాచలం ఆగస్టు 18 ( డిడి9 వార్త )**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల కోసం విద్యార్థి లోకం ఆందోళనకు దిగింది. నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో మహాధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు తమ విద్యను కొనసాగించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులని, ఆ భారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపడం అన్యాయమని అన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మెమోలు, ఇతర విద్యా పత్రాలను కొన్ని ప్రైవేట్ కళాశాలలు తమ వద్దే ఉంచుకుని వేధిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### హామీలు అమలు చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు అందలేదని అభిమన్యు విమర్శించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చూడాలని కోరారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలయ్యేలా శాశ్వత విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.

### ఉద్యమాలు ఉధృతం చేస్తాం

పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని బయ్య అభిమన్యు హెచ్చరించారు. అనంతరం ఏ.ఓ. భగవాన్ రెడ్డికి విద్యార్థుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసు అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు కేసుపాక సందీప్, ముదిగొండ ప్రశాంత్, నాయకులు సాయి కిరణ్, నూప రవికుమార్, సెనగ వరపు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం నార్లాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ

- ములుగు డీఎస్పీ యన్. రవీందర్
- నేను సైతం కార్యక్రమం కింద 16 సీసీ కెమెరాలు ప్రారంభించిన డి.ఎస్.పి



**తాడ్వాయి డిడి9 వార్త**

ములుగు డీఎస్పీ N. రవీందర్ ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలోనీ నార్లాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేయడం జరిగింది, అదేవిధంగా రౌడీ కేడి ఉన్న వ్యక్తులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి వారి యొక్క ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని తెలియ జేయడం జరిగింది అదేవిధంగా దర్యాప్తును త్వరితగరితన చేసి బాధితులకు త్వరగా న్యాయం అందేలా చూడాలని సూచనలు చేయడం జరిగింది గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు మరియు విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమం నిర్వహించి వారిలో అవేర్నెస్ కల్పించాలని సిబ్బందికి సూచించడం జరిగింది నార్లపూర్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో కలియతిరిగి పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని 5S విధానం పాటించాలని సిబ్బందికి సూచించడం జరిగింది అదేవిధంగా నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆవిష్కరించారు. ప్రజలంతా తమ వంతు బాధ్యతగా తమ తమ గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

## ఎఫ్ఎల్ఎన్ తో శ్వాస పీల్చాలి ఎఫ్ఎల్ఎన్‌తో శ్వాస వదలాలి

### భద్రాచలం ఎంఈవో బెక్కంటి శ్రీనివాసరావు



**భద్రాచలం , ఆగస్టు 18 ( డిడి9 వార్త )**

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి కేంద్రిత బోధనకు ఉపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం భద్రాచలం మండల రిసోర్స్ కేంద్రంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో గుణాత్మక విద్యను సాధించేందుకు తరగతి గదిలో అభ్యసనా సామర్థ్యాలను విద్యార్థి కేంద్రంగా ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రధానోపాధ్యాయులకు సుమారు రెండు గంటలపాటు శిక్షణ ఇచ్చారు. బుధ, గురువారాల్లో మండలంలోని కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించనున్న సమావేశాల్లో తీసుకోవాల్సిన అంశాలు, పాటించాల్సిన విధానాలు, బోధించాల్సిన అంశాలపై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లకు పలు సూచనలు చేశారు. అలాగే ఈ ఏడాది మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక విద్యార్థుల నమోదును సాధించిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గవర్నమెంట్ హైస్కూల్ కు చెందిన జాన్సన్ , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి. రమా, మండల ప్రాథమికోన్నత పాఠశాల, జగదీష్ కాలనీకి చెందిన రాజా శ్రీనివాస్ , ప్రాథమిక పాఠశాల, తాతగుడి సెంటర్ కు చెందిన పాపయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ పీలు గోపి, ఆర్ కే, సీసీ బేబీ, ఐఈఆర్ పీ ఎస్. పద్మ, ఏపీఎం పాల్గొన్నారు.

## గన్నేరువరం పీహెచ్‌సీ పనులు వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**మానకొండూర్ ప్రతినిధి, ఆగష్టు 18, :**

గన్నేరువరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులను మంగళవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భవనంలోని అన్ని గదులను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గన్నేరువరం మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని సౌకర్యాలతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైద్యులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణం చేపట్టాలని అన్నారు.

# విద్యుత్ ప్రైవేటీకరణతో ముప్పు..








- ప్రజలు, నిరుద్యోగులపై తీవ్ర భారం!
- కాంట్రాక్ట్ టెండర్ల పేరిట నష్టాల్లోకి విభాగాలు
- సామాన్యుడిపై మోయలేని చార్జీల భారం
- కనుమరుగు కానున్న కొత్త ఉద్యోగాలు
- 47 రోజులుగా ఉద్యోగుల నిరసన
- నేడు విద్యుత్ సౌధ ముట్టడి

**భద్రాచలం , ఆగస్టు 18 ( డిడి9 వార్త )**

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా జరుగుతున్న పరిణామాలు భవిష్యత్తులో తీవ్ర ప్రతికూల ఫలితాలకు దారితీసేలా ఉన్నాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పరిధిలోని విద్యుత్ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు, కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల ప్రజలతో పాటు నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం జిల్లాలోని పాల్వంచ, భద్రాచలం, మణుగూరు మూడు డివిజన్ల పరిధిలో విద్యుత్ ఉద్యోగులు గత 47 రోజులుగా ఆందోళన బాట పట్టినప్పటికీ ప్రజా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ.. నేడు హైదరాబాదులోని 'విద్యుత్ సౌధ' ముట్టడికి ఉద్యోగులు రణభేరి మోగించారు.

**అధిక టెండర్లతో ఆర్థిక నష్టం**

ప్రస్తుతం విద్యుత్ శాఖలోని సొంత సిబ్బందితో చేస్తున్న పనులను కూడా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు అధిక విలువతో టెండర్లు కేటాయిస్తున్నారు. శాఖ ద్వారా అయ్యే వ్యయం కంటే ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న టెండర్ల విలువ చాలా ఎక్కువగా ఉండటంతో డిపార్ట్ మెంట్ కు తీవ్రమైన ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఉద్యోగావకాశాలకు భారీ గండి ప్రైవేటీకరణ వల్ల అత్యంత తీవ్రంగా దెబ్బతినేది తెలంగాణ నిరుద్యోగ యువతే. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత, ఆ ఖాళీలలో కొత్త నియామకాలు చేపట్టే అవకాశం లేకుండా పోతుంది. ఒకవేళ సంస్థలు ప్రైవేట్ పరమైతే తెలంగాణ యువత తమ ఉద్యోగావకాశాలను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

**సామాన్యులపై ఛార్జీల భారం.. పథకాలకు ముప్పు!**

విద్యుత్ అనేది సామాన్య మానవుడి రోజువారీ జీవితంలో అత్యంత కీలకమైన అత్యవసర సేవ. కాంట్రాక్ట్ సంస్థలు తమ వ్యయాన్ని, లాభాలను రాబట్టుకోవడానికి నిరంతరం కరెంట్ చార్జీలను పెంచే అవకాశం ఉంది. విద్యుత్ చార్జీల రూపంలో సామాన్య ప్రజలపై అధిక భారం పడుతుంది. అంతేకాకుండా, ప్రభుత్వం ప్రస్తుతం పేదలకు, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు కూడా ప్రైవేటీకరణ వల్ల భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**విద్యుత్ ఉద్యోగుల మహాధర్నాను జయప్రదం చేయాలి**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నేడు హైదరాబాద్ లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్, డీఈ కె. జీవన్ కుమార్ పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన పోస్టర్ ను మంగళవారం భద్రాచలం డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కె. జీవన్ కుమార్ మాట్లాడుతూ పీఆర్సీ విద్యుత్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని అన్నారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణతోపాటు ఈపీఎఫ్ ను జీపీఎఫ్ గా మార్చాలని, సాధారణ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ ఈబీ నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేశారు .

### కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం వలన చార్జీల మోత

ప్రయివేటీకరణ చేస్తే విద్యుత్తు సంస్థల మనుదగ కోల్పోనున్నాయి. కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం వలన చార్జీల మోత, ప్రజలకు నష్టం కలిగించే సంస్కరణలు తెస్తే ఆ భారం ప్రజలతో పాటు విద్యుత్తు సంస్థల మనుగడపై సైతం పడుతుంది. దీంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసిన అవసరం ఏర్పడుతుంది. ప్రభుత్వమే నడిపితే విద్యుత్తు సంస్థల మనుగడ బాగుటుంది. ప్రభుత్వం ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

**బొల్లి వెంకట్రాజు, విద్యుత్తు శాఖ ఉద్యోగి, భద్రాచలం**

### ప్రయివేటీకరణ వలన ప్రజలపై పెనుభారం

విద్యుత్తు సంస్థల ప్రయివేటీకరణ వలన భవిష్యత్తులో వినియోగదారులపై ఆర్థికభారం తీవ్రంగా పడనుంది. అలాగే ఇప్పుడు విద్యుత్తు సంస్థలో ఇచ్చే కాంట్రాక్టులను అధిక రేట్లకు ఇవ్వడం వలన వినియోగదారులపై ఆర్థికభారం పడుతుంది. దీంతో విద్యుత్తు చార్జీలను పెంచడంతో పాటు విద్యుత్తు సంస్థలు మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది.

**జీవన్‌కుమార్, విద్యుత్తు శాఖ డీఈ, భద్రాచలం**

## కేంద్ర పథకాల అమలుపై దిశా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశం..

- ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.
- సమావేశంలో పాల్గొన్న ఎంపీలు,ఎమ్మెల్యేలు,అధికారుల

**మణుగూరు.ఆగస్టు 18 (డి డి 9వార్త)**

జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రజాప్రతినిధులు సూచించారు. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనులు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధన తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు.

**ప్రజలకు పథకాల ఫలాలు అందేలా చర్యలు**

గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు కీలకంగా ఉన్న నేపథ్యంలో వాటి అమలును మరింత వేగవంతం చేయాలని సమావేశంలో సూచించారు. పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి, గృహ నిర్మాణం తదితర రంగాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

**పినపాక నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే పాయం దృష్టి**

సమావేశంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని నియోజకవర్గంలోని అభివృద్ధి అవసరాలను ప్రస్తావించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో చేరేలా




ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.పినపాక నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**అధికారుల సమన్వయంతో అభివృద్ధి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో వివిధ శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సమావేశంలో సూచించారు. నిధులు మంజూరైన పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడంతో పాటు, పనుల నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులు కోరారు.అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే జిల్లాలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ఈ సమావేశంలో ఎంపీలు రామ సహాయం రఘురామ్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ PO, కొత్తగూడెం మేయర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం. విరిగిన చెట్ల కొమ్మలు. తొలగింపు

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం డి డి 9 వార్త )**

ఆగష్టు 18 సోమవారం రాత్రి గాలివాన బీభత్సానికి. తలమడుగు మండలంలోని జరి షేకు గూడ. గ్రామాలలో.చెట్లువిరిగి రహదారిపై పడటంతో స్థానిక వాహనదారులకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే విద్యుత్ తీగలు.తెగి పడటంతో. ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ మడవి లక్ష్మణ్. వార్డు సభ్యులు. గోడం భుజంగరావు అల్లుల నవీన్. మరియు కాలనీవాసుల సహాయంతో రోడ్డుపై పడిన భారీ చెట్ల కొమ్మలను తొలగించి ప్రజల రాకపోకలను ప్రారంభించారు మరియు విద్యుత్ సమస్య పరిష్కారం కోసం. స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లి. తెగిపడిన వైర్లను. పునరుద్ధరించి కరెంటు సరఫరాకు అంతరాయం కలగకుండా సరి చేశారు స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని. ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించి పనులు చేపట్టడంపై. వారిని గ్రామస్తులు ఎంతగానో అభినందించారు



# కార్మిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తే సంస్థ ఉత్పాదకత దెబ్బతింటుంది

- **సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి..**
- **ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు.ఆగస్టు 18 (డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి ఏరియాలోని ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్–4లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం వల్ల విధి నిర్వహణలో కార్మికుల ఉత్సాహం, ఆసక్తి, నిబద్ధత తగ్గిపోయి సంస్థ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగేల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్–4ను సందర్శించి వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం, భద్రత, పని పరిస్థితుల మెరుగుదలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గనిలో విధులు నిర్వహిస్తున్న జనరల్ అసిస్టెంట్లకు వారు నిర్వర్తిస్తున్న పనులకు అనుగుణంగా యాక్టింగ్‌లు నమోదు చేయకపోవడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్–2 పేరిట రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద ఖాళీగా ఉన్న కేటగిరీలలో ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్–4లో పనిచేస్తున్న అర్హత కలిగిన జనరల్ అసిస్టెంట్లకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ సెక్షన్‌లోని గది పైభాగం, కింది భాగం అధ్వాన్నంగా ఉన్నప్పటికీ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్పు చేయకపోవడం సరికాదన్నారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వెస్ట్రన్ టాయిలెట్‌ను నామమాత్రంగా ఏర్పాటు చేసి వదిలి వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని, దానిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే విధంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కన్వేయన్స్ వాహనాల కొరత కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ సంస్థలకు చెందిన వాహనాల్లో కార్మికులు ప్రయాణించాల్సి వస్తోందని, దీనివల్ల భద్రతపై ఆందోళన నెలకొంటోందన్నారు. కార్మికుల రాకపోకలకు సరిపడా సింగరేణి కన్వేయన్స్ వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. క్యాంటీన్ హాల్‌లో ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదని, ఫ్రిజ్‌ల మరమ్మతులు పూర్తికావడం లేదని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా క్వారీలో లైట్ మోటార్ వాహనాల రహదారి దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. వే బ్రిడ్జి వద్ద రేడియం ప్రతిబింబించే సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మ్యాన్‌వే పక్కన ఉన్న మెరిట్ క్రషర్ లోడింగ్ పాయింట్




నుంచి అధికంగా దుమ్ము, ధూళి కణాలు వెలువడుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు సరిపడా వాటర్ స్ప్రే సౌకర్యాలు లేకపోవడం వల్ల కార్మికులు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దుమ్ము నియంత్రణకు అవసరమైనన్ని వాటర్ గన్స్ ఏర్పాటు చేసి, మ్యాన్‌వే గదిని కూడా తగిన ప్రదేశానికి మార్చాలని కోరారు. అలాగే కార్మికుల అవసరాలకు అనుగుణంగా పే డేల సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం వల్ల తాత్కాలికంగా కొంత ఖర్చు ఆదా కావచ్చని, అయితే దీర్ఘకాలంలో దాని ప్రభావం సంస్థపై తీవ్రంగా పడే అవకాశం ఉందని నాగేల్లి వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉత్పాదకత తగ్గడం, ప్రమాదాల ముప్పు పెరగడం, వైద్య ఖర్చులు అధికం కావడం, గైర్హాజరు పెరగడం, కార్మికుల్లో అసంతృప్తి, పారిశ్రామిక వివాదాలు ఏర్పడటం, సంస్థ ప్రతిష్ట దెబ్బతినడం వంటి పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం టీబీజీకేఎస్ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. కార్మికుల సంక్షేమం, భద్రత, సౌకర్యాలను మెరుగుపరిచినప్పుడే వారు మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు తమ వంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిబిజికేఎస్ నాయకులు మునిగేల నాగేశ్వరరావు, పి.కె. నాగరాజు, ఫిట్ సెక్రటరీ సర్వే నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ బాబు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి తక్కి, యోగి, సాగర్, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి..

- **కార్మిక, ఉపాధి, గనుల శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసిన..**
- **సామాజిక కార్యకర్త,న్యాయవాది కర్నె రవి.**

**మణుగూరు.ఆగస్టు 18 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ పరిధిలోని యువతకు స్థానికంగా వంద శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు, భూగర్భ శాఖల మంత్రి డా. వివేక్ వెంకటస్వామి ని కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మణుగూరులో జరిగిన మంత్రి పర్యటన సందర్భంగా కార్మికులు, స్థానిక నిరుద్యోగ యువత, భూనిర్వాసితులు, విద్యార్థుల సమస్యలపై రవి మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గం గనులు, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించడం లేదన్నారు. నియోజకవర్గ పరిధిలోని సారపాక లో ప్రఖ్యాత ఐటిసి కర్మాగారం, అశ్వాపురం మండలంలో హెవీ వాటర్ ప్లాంట్, మణుగూరులో భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, సింగరేణి పరిధిలోని గనులతో పాటు, పలు ప్రైవేట్ కంపెనీలు, మైనింగ్ కాంట్రాక్టర్లు, అను బంధ పరిశ్రమల్లో అర్హత కలిగిన స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఏజెన్సీ నియోజకవర్గం పినపాక లోని పలు మండలాలలో స్థానిక యువతకు అవసరమైన నైపుణ్యాలు కల్పించి, అవకాశాలతో ఉపాధి కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ ను ప్రభుత్వం మరింతగా బలోపేతం చేసి, మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్,ఈవి టెక్నాలజీ, గ్రీన్ మొబిలిటీ, నిర్మాణ రంగం తదితర పరిశ్రమలకు అవసరమైన ఉద్యోగ ఆధారిత కోర్సులను విస్తరించాలని కోరారు. అదేవిధంగా స్థానిక సింగరేణి, భద్రాద్రి పవర్ ప్లాంట్, ఐటీసి, హెవీ వాటర్ ప్లాంట్ తదితర ప్రాజెక్టుల వల్ల ప్రభావితమైన భూనిర్వాసిత కుటుంబాలకు ఉపాధి, పునరావాసం, పునరావాస ప్రయోజనాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, సెలవులు, భద్రతా ప్రమాణాలు తదితర చట్టబద్ధ హక్కులు సక్రమంగా అమలు చేయడం తో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సమర్థవంతమైన గ్రీవెన్స్ రిడ్రెసల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరినట్లు కర్నె రవి విలేకరులకు తెలిపారు. స్థానిక గిరిజన యువతకు ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్, అప్రెంటిస్, అలాగే కార్మికులు, భూనిర్వాసితులు, నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్య లను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు మణుగూరులో ప్రత్యేక లేబర్ ఎంప్లాయిమెంట్, మరియు మరియు స్కిల్ డెవలప్మెంట్ గ్రీవెన్స్ సెల్ ను ఏర్పాటు చేయాలని మంత్రి డా. వివేక్ వెంకటస్వామిని కోరినట్లు తెలిపారు. తన విజ్ఞప్తి కి మంత్రి డా.వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించారని, కార్మికులు, స్థానిక యువత, భూనిర్వాసితులు, విద్యార్థుల సమస్యల పై పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వివేక్ స్పష్టమైన హామీని ఇచ్చినట్లు రవి పేర్కొన్నారు.

# రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా శైలేంద్ర వాఘ్మారే

**డిడి9 వార్త, గుడిహత్నూర్:**

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా శైలేంద్ర వాఘ్మారే నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శైలేంద్ర వాఘ్మారే మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తన నియామకానికి సహకరించిన పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి గటిక క్రాంతి కుమార్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపురేలకు శైలేంద్ర వాఘ్మారే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ సమాజ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమాజ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీజేపీ బలోపేతానికి, ఎస్సీ సమాజ సంక్షేమానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని శైలేంద్ర వాఘ్మారే స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తల అభినందనలు శైలేంద్ర వాఘ్మారేకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యత లభించడంపై గుడిహత్నూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ పార్టీకి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

**ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి**
**ఏపీఎం కొట్టే వెంకటేశ్వర్లు**

**బోనకల్,ఆగస్టు 18,(డీ డీ9 వార్త):**




ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వద్ద మానవ అక్రమ రవాణా పై ఒక్క రోజు శిక్షణ ను స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు నిర్వహించడం జరిగింది.శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎం కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా,ఆడపిల్లల మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.ప్రతి ఒక్క గ్రామ సహాయకురాలు ఈ అక్రమ రవాణాపై అవగహన కలిగి గ్రూప్ మీటింగ్ లలో,గ్రామ సభల్లో అందరినీ చైతన్య పరిచాలన్నారు.ముఖ్యంగా మహిళలు, బాలికలు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజ్వల సంస్థ రిసోర్స్ పర్సన్ భూపాల్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద నేరంగా ఉందని,ప్రతి రోజు ఎంతోమంది అమ్మాయిలు మహిళలు మోసపోతున్నారన్నారు, దీనిపై గ్రామ స్థాయిలో ప్రజలతో మంచి సంబంధలాను కలిగి ఉన్న వీఓఏ లు (గ్రామ సహాయకులు) అవగాహనా కల్పించాలని అన్నారు.ఏదైనా సమస్య ఎదురైనపుడు 112 పోలీస్,1930 సైబర్ ట్రాఫికింగ్, 181 మహిళా హెల్ప్ లైన్ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్స్ ను సంప్రదించాలని అన్నారు. అక్రమ రవాణాకి సంబందించిన విషయాలను లఘు చిత్రాలు పవరపాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.మహిళా సంగం సభ్యులతో ఒక జాగృతి సంఘాన్ని ఏర్పాటు చేసి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించే విదంగా పని చేయాలన్నారు. ఈ శిక్షణలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు భూపాల్,హరీష్, నాగరాణి,మండల మహిళా సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్స్,మండల గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ జోలికి వెళ్తే శిక్ష తప్పదు

- **చదువుపైనే దృష్టి పెట్టాలి..**
- **అనవసర సమస్యలు తెచ్చుకోవద్దు: ఎస్సై స్వప్న**




**భద్రాచలం, ఆగస్టు 18 (డిడి9 వార్త)**

విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ఈ మహమ్మారికి పాల్పడేవారు చట్టరీత్యా శిక్షార్హులని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి హవిలా స్పష్టం చేశారు. మంగళవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు తమ పూర్తి దృష్టిని చదువుపైనే కేంద్రీకరించాలని, ర్యాగింగ్ వంటి చర్యల ద్వారా తోటి విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించి వారి ఉజ్వల భవిష్యత్తును పాడు చేయవద్దని హితవు పలిపారు. కళాశాలలో పకడ్బందీగా యాంటీ ర్యాగింగ్ కమిటీ పని చేస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బాధితులకు యాంటీ ర్యాగింగ్ సెల్ ద్వారా తగిన కౌన్సిలింగ్ అందించడంతో పాటు, సీనియర్లు జూనియర్ల పట్ల ప్రేమానురాగాలతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థులు వివాదాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని ఉద్బోధించారు. చిన్నపాటి అజాగ్రత్తతో అనవసర విషయాల్లో తలదూర్చి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థినులు ఎలాంటి సమస్యలకైనా భయపడకుండా కళాశాలలోని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అందించే సూచనలను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎస్సై రాంబాబు, డాక్టర్ రాగ సుమ, డాక్టర్ నాగ సమీర, సుధాకర్, రమేష్, పూర్ణిమతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

- **376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన గౌడ సంఘం**
- **జెండాను ఆవిష్కరించిన గౌడ సంఘం మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ గౌడ్**



**మంగపేట ఆగస్టు18డీడీ9 వార్త**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని, ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని గౌడ సంఘం మండలాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం గౌడ సంఘం మండలాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ గౌడ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు భావితరాలకు ఆదర్శనీయమని అన్నారు. కులమతాలకు అతీతంగా బహుజనులను ఏకం చేసి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి, సమానత్వ భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కారుపోతుల నరసయ్య, గాజుల ఈశ్వర్, నక్క యాకయ్య, రామగాని నరేందర్, చామకూరి కృష్ణ, గడ్డం పరమేష్, బండపల్లి కేశవులు, చామకూరి సోమయ్య, గౌని రమేష్, గంట రాజు, గాజుల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొడిమ్యాలలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలు

**చొప్పదండి/కొడిమ్యాల, ఆగష్టు 18 :**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంగడి బజార్ లో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ 376వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై, పెత్తందారీ వ్యవస్థపై తిరుగుబాటు చేసి తన మిత్ర బృందమైన సాకలి సర్వన్నను, మంగలి మాదన్నను, కుమ్మరి గోవిందును జక్కుల పెరమండ్లను దూదేకుల పీర్ మమ్మద్, వెంకన్న, తదితరులను సైన్యంగా మలుచుకొని వారికి యుద్ధంపై మెలుకువలు నేర్పించి వేలాది మంది సైనికులను తయారు చేసుకొని ఎన్నో కోటలపై యుద్ధం చేసి గెలిచి, మొగల్ సామ్రాజ్యాన్ని గజగజలాడించి గోల్కొండ కోటను ఏలిన బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న 17వ దశాబ్దంలోనే తెలంగాణ పౌరుషాన్ని చూపించిన తెలంగాణ తొలి విప్లవ సూర్యుడు అని గుర్తు చేశారు. నేటి యువత వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదగాలని అన్నారు.

## రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా శైలేంద్ర వాఘ్మారే

**డిడి9 వార్త గుడిహత్నూర్:**





రాష్ట్ర బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా శైలేంద్ర వాఘ్మారే నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శైలేంద్ర వాఘ్మారే మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి గటిక క్రాంతి కుమార్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపురేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీజేపీ బలోపేతానికి, ఎస్సీ సమాజ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శైలేంద్ర వాఘ్మారే తెలిపారు.

## ఫర్టిలైజర్ డీలర్లకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ గురించి అవగాహన



**డిడి9 వార్త గుడిహత్నూర్:**

మండలంలోని సీడ్స్ మరియు ఫర్టిలైజర్ డీలర్లకు మంగళవారం మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా రైతులకు పంటల వారీగా యూరియా, డిఎపి ,ఎంఓపి, మరియు కాంప్లెక్స్ ఎరువులు ఎలా బుక్ చేసుకోవాలో ఈ యాప్ గురించి మండల వ్యవసాయాధికారి భగత్ రమేష్ డీలర్లకు అవగాహన కల్పించారు.రైతులు వివిధ రకాల ఎరువుల కొనుగోలు కొరకు డీలర్ వద్దకు వచ్చినప్పుడు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ గురించి డీలర్లు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. క్రిమి సంహారక మందులు మరియు ఎరువులు రైతులకువిక్రయించేటప్పుడు తప్పని సరిగా పంటల వారీగా సిఫార్సులకు అనుగుణంగా మందులు ఇవ్వాలన్నారు.పురుగులు, శిలీంద్రాల రోగాలను అనుసరించి పిచికారి మందులు సరైన మోతాదులో వాడేటట్లు రైతులకుసూచించాలన్నారు. ప్రతిరోజు డీలరు రిజిస్టర్ స్టాక్ రిజిస్టర్ స్టాక్ బోర్డు తప్పనిసరిగా ప్రతిరోజు వివరాలను బోర్డుపై తెలియజేయాలన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు పూర్తి వివరాలతో బిల్లును ఇవ్వాలన్నారు. గడువుతీరిన మందులను ఎరువులను ఇచ్చిన మరియు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం: కలెక్టర్





**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 18(డిడి9 వార్త):**

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని అన్నారు.సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు.పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, గౌడ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణలో తాటి వెంకటేశ్వర్లు..





**అశ్వారావుపేట: ఆగస్టు 18(డిడి 9వార్త)**

తెలంగాణ వీరుడు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా అశ్వారావుపేట పట్టణంలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సినీ హీరో సుమన్ గౌడ్‌తో కలిసి తాటి వెంకటేశ్వర్లు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన గొప్ప ప్రజా యోధుడని అన్నారు. నాటి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ సామాన్య ప్రజలను ఏకం చేసి వారి హక్కుల కోసం పోరాడిన పాపన్న గౌడ్ ధైర్యం, సాహసం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, ముఖ్యంగా యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించడంలో పాపన్న గౌడ్ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన చూపిన ఆత్మగౌరవం, ధైర్యం, సమాజం కోసం పోరాడే తత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అశ్వారావుపేట పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని తాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ విగ్రహం పాపన్న గౌడ్ చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు గుర్తుచేసే గొప్ప స్మారక చిహ్నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గౌడ సమాజంతో పాటు అన్ని బడుగు బలహీన వర్గాలు ఐక్యంగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, గౌడ కులస్తులు, బీఆర్ఎస్ నాయకులు కాసాని పద్మ, చంద్రమోహన్, స్థానిక కౌన్సిలర్ డా. భూక్యా ఉదయ జ్యోతి, ప్రసాద్, జుజ్జురపు శ్రీరామ్మూర్తి, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సంపూర్ణ, మోటూరి మోహన్, వీరాజు, శివ, ఉమేష్, గోవింద్ గౌడ్, గాదెగోని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి గౌడ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సేవలను, పోరాటాలను స్మరించుకున్నారు. జై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది.

# వంశీ మెమోరియల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ

**బోనకల్,ఆగస్టు 18, డీడీ 9 వార్త:**



బహుజన సమాజ్ పార్టీ ఉద్యమ నేత గంధం వంశీ మెమోరియల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ చేశారు, వంశీ తన జీవించి ఉన్న సమయంలో ఎన్నో ప్రజా సమస్యల పై ,సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం చేశారు,విద్య వ్యవస్థ బలోపేతం కోసం,ప్రభుత్వ పాఠశాల పిల్లలకు తనకున్న స్థాయిలో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు,మరణ అనంతరం ఆయన ఆశయాలు ఆలోచనలు,తన సేవను కొనసాగించాలనే ఉద్దేశ్యంతో వంశీ సోదరుడు గంధం ఆనంద్,అన్నయ్య గంధం పుల్లయ్య కలిసి ఫౌండర్స్ గా వంశీ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా చేయాలనే సంకల్పంతో ఖమ్మం జిల్లాలో ప్రముఖ వైద్యులు యలమద్ది హాస్పిటల్ డాక్టర్ ఎస్ శరత్ చంద్ర (ఎం.డీ) (డి.ఎమ్)సీనియర్ న్యూరో ఫిజిషయన్ చేతుల మీదుగా లోగోను ఆవిష్కరించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశీ ఆశయాలు,ఆలోచనలు మీరు కొనసాగించటం అనేది స్పూర్తి దాయకం అని, సమాజంలో ప్రతీ ఒక్కరు సేవ భావం కలిగి ఉండాలని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో యలమద్ది హాస్పిటల్ మేనేజ్మెంట్ సైదరావు,మోదుగు రాజా,వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చోడ ప్రెస్ క్లబ్ ఎన్నికల పర్వం

- **అందరు కలిసి బ్యాలెట్ పద్ధతిలో నూతన కార్యవర్గం ఎంపిక**
- **అధ్యక్షుడిగా కొత్తూరు లక్ష్మణ్ విజయం సాధించారు**



**ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ : (డిడి 9 వార్త న్యూస్)**

జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే దిశగా తమ ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని ఇచ్చోడ మండలం లో ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ని ఎన్నికల పద్ధతిలో నిర్వహించడం జరిగింది . ఇచ్చోడ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో, హోరాహోరీగా ముగిశాయి. అధ్యక్ష పదవి కోసం కొత్తూరు లక్ష్మణ్, అన్నెల లక్ష్మణ్, మేడపట్ల సాయన్న ముగ్గురూ పోటీ పడగా, సభ్యులు ప్రజాస్వామ్యబద్ధంగా బ్యాలెట్ పద్ధతి ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అత్యధిక సభ్యుల మద్దతు పొందిన కొత్తూరు లక్ష్మణ్ అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు కమిటీ సభ్యులు తమ సమస్యలని కుటుంబ రూపంగా సహకారం అందిచాలని కోరారు కమిటీ సభ్యులు ప్రతీ నెల కొనసరి సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యలను పరిష్కారం చేసేవిదంగా పని చేయాలనీ ఎకభిప్రాయంగా అన్నారు నూతన కార్యవర్గం వివరాలు అధ్యక్షుడు కొత్తూరు లక్ష్మణ్ ఉపాధ్యక్షులు సిరిగిరి శ్రీనివాస్, ఎం.ఏ. జాకీర్ ప్రధాన కార్యదర్శి రాథోడ్ అజయ్,గౌరవసలహాదారులు నరాల రమణయ్య, మాధవ్, రవూఫ్ ఖాన్ ఈ సందర్భంగా ఎన్నికైన పత్రికేయులు వివరిస్తూ మండలంలోని జర్నలిస్టులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, వారి హక్కులు మరియు సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు మరియు తోటి పాత్రికేయులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు..

# మేడారంలో నార్కోటిక్స్ డాగ్ తో సడెన్ చెక్స్

- **కిరాణా షాపుల్లో నార్లాపూర్ ఎస్.ఐ కమాలకర్ తనిఖీలు.**
- **.గంజాయిపై ఉక్కుపాదం మేడారంలో షాపుల తనిఖీలు**

**తాడ్వాయి డిడి9 వార్త**







ములుగు జిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలం,మేడారం నార్లాపూర్ ఎస్.ఐ మంగళవారం మేడారం ప్రాంతంలోని సందేహాస్పద కిరాణా షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ డాగ్ సహాయంతో షాపులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపు యజమానులకు నిబంధనలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఎస్.ఐ తెలిపారు.

# కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాల్సిందే




- తులం బంగారం ఇవ్వాల్సిందే
- బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో 15 లక్షల మందికి పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం అందింది.
- 14 లక్షల మంది ఆడబిడ్డలకు కెసిఆర్ కిట్టు అందించిన ఘనత కెసిఆర్ దే
- గత ప్రభుత్వహాయంలో రైతు భీమా పథకం 2018లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి 2021 నాటికి 65,184 రైతు బీమా క్లెయిమ్ లు పరిష్కరించబడ్డాయి బాధిత కుటుంబాలకు మొత్తం ₹3,259.3 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశారు.!!

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నేడు ఇచ్చోడా మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా లో నిర్వహించిన ధర్నాలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన వెంటేనే పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం అంటే ఆర్థిక భారమో గుర్తించిన మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ 2014 అక్టోబర్ 02న కళ్యాణ లక్ష్మీ – షాది ముబారక్ పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో 51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయం తర్వాత 1,00,116కు పెంచారని ప్రభుత్వమే ఒక కుటుంబ సభ్యుడిగా భాగస్వామిగా నిలబడిందని కెసిఆర్ హయాంలో సుమారు 15లక్షల మంది ఆడబిడ్డలకు కెసిఆర్ మేనమామలా సహాయాన్ని అందించారు ఆడబిడ్డలకు గొప్ప వరంగా ఈ పథకం నిలిచిందనీ అన్నారు. ఈ పథకానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు సైతం లభించింది. 2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు కానీ ఇప్పుడు ఉన్న జూటా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గెలిచిన రోజు నుంచి లక్షతో పాటి తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేసిండు అని అన్నారు.కేసీఆర్ ముందే రాష్ట్ర ప్రజలకు ముందే చెప్పారు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలకు రామ్ రామ్ అని . ఈ విషయం ప్రజలకు ఇప్పుడు తెలిసిసోస్తున్నది కెసిఆర్ ప్రభుత్వంలో నేల రోజుల్లో ఆర్థిక సహాయం అందితే ఈ రేవంత్ ప్రభుత్వంలో పెళ్ళై పిల్లలు పుట్టినా కూడా ఆర్థిక సహాయం అందడం లేదని అన్నారు.కార్యాలయాల చుట్టూ తిరగలేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని గుర్తుచేశారు. హైకోర్టులో గడువు లభించినప్పటికీ కౌంటర్ ఎందుకు వెయ్యలేదో ఈ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, సహాయ మంత్రులు ప్రభుత్వ కీలక కేసుల్లో ప్రైవేట్ న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం పేద ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన పథకం విషయంలో ఎందుకు సరిగ్గా స్పందించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కావాలనే ఆలస్యం చేసి పథకాన్ని నిలిపివేయాలనే ఆలోచనను మానుకోవాలని పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు,ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు.లేకపోతే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు అదేవిదంగా రైతు ల పాటిలిట కూడా శాపం గా మారిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని కొనసాగకుండా ప్రీమియం చెల్లించని ప్రభుత్వం చెల్లించాలని అన్నారు




# కామారెడ్డికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

- విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్




**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 18(డిడి9 వార్త):**

కామారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఏర్పాటు కానుంది.ఈ మేరకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని షబ్బీర్ అన్నారు.పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.పాఠశాల విద్యాశాఖ ద్వారా జి.ఓ.ఆర్.టి. నం.145, తేదీ 04-08-2026 ప్రకారం కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి రూ.200 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు.ఒకే ప్రాంగణంలో నాణ్యమైన పాఠశాల విద్యతో పాటు ఉన్నత విద్యకు అవసరమైన విద్యా వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సదుపాయాలు, విద్యార్థుల వసతి, భోజనం తదితర ఆధునిక మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వివరించారు.పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షబ్బీర్ పేర్కొన్నారు.ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతోనే విద్యారంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు.ఈ పాఠశాల కామారెడ్డి విద్యార్థులకు గొప్ప అవకాశంగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలను పోటీ ప్రపంచానికి సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాసంస్థల ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పన, డిజిటల్ విద్య, ప్రయోగశాలలు, ఆధునిక భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కామారెడ్డిని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో రూ.200 కోట్ల ప్రాజెక్టు మరో కీలక ముందడుగని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తామని, కామారెడ్డి నియోజకవర్గ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని షబ్బీర్ తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కామారెడ్డి నియోజకవర్గంలోనే నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 18(డిడి9 వార్త):**

కుష్టు వ్యాధి నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర స్థాయి బృందం చేపట్టిన పర్యటనలో భాగంగా మంగళవారం కామారెడ్డి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన స్టేట్ లెప్రసీ కంట్రోల్/ఎరాడికేషన్ బృందం జిల్లాకు విచ్చేసి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా రాష్ట్ర బృందం అధికారులు బిక్కనూరు పీహెచ్‌సీ, ఎస్ఎస్‌సీ నగర్ పీహెచ్‌సీ, రాజీవ్ నగర్ యూపీహెచ్‌సీతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో లెప్రసీ నోడల్ పర్సన్లు, వైద్య సిబ్బందికి కుష్టు వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ప్రతి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సమన్వయంతో పనిచేసి కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని రాష్ట్ర బృందం అధికారులు సూచించారు.కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలిపారు.జిల్లాలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేలు, అవగాహన కార్యక్రమాలను రాష్ట్ర బృందం పరిశీలించింది.సంబంధిత రికార్డులు, నివేదికలను తనిఖీ చేసి, అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.కామారెడ్డి జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు ఎస్ఎంఓ డాక్టర్ రాజు, డీపీఎంవోలు కల్పించారు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, డీఎస్ఓ సురేందర్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి. ప్రదీప్ కుమార్, డీపీఎం జీవన్‌తో పాటు జిల్లాలోని పీహెచ్‌సీల లెప్రసీ నోడల్ పర్సన్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కథలాపూర్ లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలు ఎన్నిక



**బాన్సువాడ, ఆగస్టు 18(డిడి9 వార్త):**

బాన్సువాడ మండలం కథలాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా వ్యాప్తంగా నూతన యువ శక్తులతో సంస్థాగత నిర్మాణాలను బలోపేతం చేస్తున్నట్లు కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంథని సామ్యేల్ మాదిగ తెలిపారు.ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ 32 సంవత్సరాలుగా ఉద్యమం కొనసాగిస్తోందని, అనేక సామాజిక సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించిందని ఆయన పేర్కొన్నారు.ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు యువత, విద్యావంతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమ పునర్నిర్మాణం జరుగుతోందని, అన్ని మండలాలతో పాటు జిల్లా స్థాయిలోనూ నూతన కమిటీల నిర్మాణంలో నవతరం యువత భాగస్వాములు కావాలని కోరారు.ఈ సందర్భంగా గవల్వాడ్ గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గవల్వాడ్ దశరథ్ మాదిగ, అధికార ప్రతినిధిగా కంబ్లె హనుమంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గవల్వాడ్ అంకుష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా సంతోష్ మాదిగ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎంఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గవల్వాడ్ రాము, అధికార ప్రతినిధిగా కంబ్లె బలిరాం మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గవల్వాడి బాపూరావు మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాన్సువాడ అసెంబ్లీ ఇన్‌చార్జీలు మౌరం శ్రీకాంత్ మాదిగ, బోయ్ సాయిలు మాదిగ, ఎల్లారెడ్డి ఇన్‌చార్జీలు కత్తి పద్మారావు మాదిగ, పెద్దపురి గంగారాం మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి బీర్కూర్ మండల నాయకులు రామకృష్ణ మాదిగ, బాసోలా కుమార్ మాదిగ తదితరులు హాజరయ్యారు.

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జగిత్యాల/కొడిమ్యాల, ఆగష్టు 18 :**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, సాదా బైనామా, మీసేవ ఫైల్స్ లను పరిశీలించి పెండింగ్ ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. – ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూనూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518